
సూర్యుడు నడినెత్తి మీంచి సగభాగం కిందికి జారాడు. చేలో ప్రత్తిపంటను చూసుకుని ఇంటి కొచ్చాడు బలరామయ్య. ఓ చెంబెడు చల్లతాగి, కండువా, చొక్కా వొంకెకు తగిలించాడు.

# పొరల్లుడు

కురుగంటి నాగలక్ష్మి



సావిట్లో అరుగు మీద కూర్చుని నేలకేసి కండె తిప్పుతూ నులక నేయటం మొదలుపెట్టాడు బలరామయ్య. ది యాభైఏళ్ల వయస్సు.

త నొక్కడే పనంతా చేసుకోడం కష్టమనిపించినప్పుడు చేతి కందొచ్చిన కొడుకొకడుంటే బాగు ణ్ణనిపిస్తుంటుంది.

పదెకరాల మాగాణి. పత్తి పంట వేశాడు.

పురుగు పుట్రా పడ్డప్పుడు మందెయ్యాలన్నా, ఎరువు గట్రా వేసుకోవాలన్నా ఒక్కడైపోయాడు.

పాడి ఇంటామే చూసుకుంటూంది — వెంకట సుబ్బమ్మ.

లేకలేక పుట్టింది కళావతి. పద్దెనిమిదేళ్లు. ఇంటర్ చదువుకుంది. వెంకటసుబ్బమ్మ కూతురికి జడేస్తూ, సావిట్లోనే కూర్చుని ఉంది.

“అయ్యా ! కొట్టమాక చచ్చిపోతాను. కొట్టమాకయ్యా !” అని ఏడుపుతో కూడిన అరుపులు వినిపిస్తున్నాయి ఎదుటి ప్రాంగణంలో నుండి. బలరామయ్య నులక ముడేసి అరుగు మీద నిలబడి చూశాడు.

రంగయ్య ఇరవైయ్యేళ్ల నాలుగో కూతుర్ని ములుగర్ర తీసుకుని చావగొట్టేస్తున్నాడు. కసిదీరా కొడ్తున్నాడు.

అతడి భార్య మిగతా కుటుంబ సభ్యులెవ్వరూ వారించడంలేదు.

తలోక మూలా నిశ్శబ్దంగా చూస్తూ నిల్చున్నారు. సావిట్లో స్తంభాల్లాగా నిల్చున్న వాళ్లను చూసి ఆశ్చర్యమేసింది.

బలరామయ్య అరుగు మీది నుంచే కేక పెట్టాడు.

“ఒరే ! రంగన్నా ! ఆడకూతుర్ని కొట్టమాక. నాశనమైపోద్ది” అని, ప్రహరీగోడ మీంచి లోపలికి చూస్తూ.

“నా కూతురు. నా ఇష్టం. సంపుకుంటా. నీ పని నువ్వు జూస్కో” అని జవాబుగా చెప్పి కూతుర్ని జుట్టుపట్టి పీకి వంగదీసి బాదేస్తున్నాడు రంగయ్య.

“అయ్యో ! కొట్టమాకరా !” అని అరుగు దిగి వారించను పోబొయ్యాడు ఆ పిల్ల దయనీయమైన ఆర్తనాదం విని ఆదుకోడానికి.

“ఇదుగో ! నిన్నే ! ఎక్కడికి పోయేది” అని వెకనించి పిలిచింది వెంకటసుబ్బమ్మ.

“ఏందే?” అని ఆగి వెనక్కి తిరిగాడు.

“ఎందుకని కొడ్తున్నాడో తెలుసా?”

“తెలీద”ని అరుగు మీద కూర్చున్నాడు.

“పెళ్లి కావల్సిన ఆడకూతురాయె.ఒళ్లు కొవ్వెక్కి పెద్దరెడ్డి పొలంలో పన్జేస్తడు సూడు. ఎంకడు. తలబిరుసు మనిషి” అని చెప్తోంది విశదపరుస్తూ.

“ఎవరు?”

“నిన్న మొన్నటియి కూడా మతికిలేవే !

ఆడేనయ్యా ! కూలీ పెంచమని రెడ్డి మీద ముఠా తీస్కబోయిండే.''

"ఆ ఎంకడా ! అయితే ఏమైందే?''

"ఇది ఆడితో ఉంటే ఊళ్లో జనం పట్టుకుంటే ఆడ్నించి ఈడ్చుకుంటా వచ్చి చావగొడ్తన్నాడు రంగయ్యన్న. ఆయన్నకు కడుపుమంటగాదూ !'' అని విషయమంతా చెప్పేసింది వెంకటసుబ్బమ్మ.

"వయసొచ్చిన కూతుర్ని ఇంట్లో ఉంచుకోవడం దేనికి? పెళ్లి చేసి పంపించెయ్యొచ్చు గదంటే?'' అని అన్నాడు బలరామయ్య ఆ పిల్లమీద సానుభూతి చూపిస్తూ యథాలాపంగా.

"ఏమీ ఎరగనట్లు మాట్లాడతావేంది? దాని మీద నలుగురక్కల పెళ్లికి ఉన్న భూమి బుర్రా నువ్వేగదా మద్దెన నిలబడి, అమ్మించావు. దీని కాడి కొచ్చాక సెంటు భూమి లేక ఊర్కున్నాడుగాని, రంగయ్యన్న ఇంతా బతుకు బతికి కూలీ నాలికి బోలేక సితికిపోతావుంటే దీని పనులేంది సెప్పు'' అని అంది కోపంగా వెంకటసుబ్బమ్మ.

గొడ్ల కొట్టంలో కుడితి నీళ్లు పెట్టి వచ్చి నులక నేస్తూనే కూర్చుడు బలరామయ్య.

రంగయ్య కూతుర్ని నోటికొచ్చినట్లు తిడుతున్నాడు.

ఆ అమ్మాయి కొడ్తున్నా వారించే శక్తి కూడా లేనట్లు మూలుగుతోంది.

ఊరికి కరెంటు వచ్చినప్పటికీ పనివేళల్లో మాత్రం మార్పు లేదు.

తెల్లారుజాముమ్నుంచి పన్లోకి దిగాలి గదా !

"ఇదుగో ! నిన్నే. ఆయన్న బిడ్డను ఆయన్నే కొట్టుకుంటే నీ కెందుకంత ఇదంట. బిడ్డను దోవకు దెచ్చుకుంటన్నడు. నీ కేలయ్యా ! యియ్యాలంతా ఆ పిల్ల బాగోతంతోనే సరిపోయిద్దే ! చేలో మందులకి పెదరెడ్డి కాడ చేబదులు తేనుపోతనన్నావ్. బాగా పొద్దుబోయె. ఈపాటికి రెడ్డి ఊరు మీదికి పోయుంటడు. రేపన్నా మర్చిపోమాక'' అని, "ఇదుగో ! నిన్నే ! అన్నం తిందువురా !'' అని కంచంలో అన్నం పెట్టి పిల్చింది వెంకటసుబ్బమ్మ.

బలరామయ్య కంచం ముందు కూర్చున్నాడేగాని, రంగయ్య సావిట్లోంచి వినిపిస్తున్న హృదయ విదారకమైన మూల్గు కడుపులో తిప్పేస్తున్నట్లనిపిస్తున్నది.

"ఇదిగో ! అన్నం తింటుండు. బయట బాగా మబ్బు పట్టున్నదీ ! మంచాలు లోనేసొస్తా'' అని వెంకటసుబ్బమ్మ బైటికెళ్లింది.

బలరామయ్య అన్నం తిన్నాననిపించి సావిట్లో కొచ్చాడు. రంగయ్య కూతుర్ని సావిట్లో స్థంభాని కట్టేసి లోపలి కెళ్లి తలుపేసుకున్నాడు.

ఆ అమ్మాయి మూలుగుతోంది. బలరామయ్య ఆ అమ్మాయి వంక జాలిగా చూస్తూ, "పువ్వుల్లో పెట్టి చూస్కోవల్సిన ఆడబిడ్డను గొడ్డును బాదినట్లు బాదిపారేసిండే. అయినా పై నలుగుర్ని పంపించేటప్పటికే రంగయ్య తిండిపెట్టే తల్లంటి భూముల్ని అమ్ముకుని మనిషి దిగులుపడి సగం చచ్చిండు'' అని అనుకుంటున్నాడు.

"ఇదుగో నిన్నే ! కడుపులో నా కిదిగా ఉంది. గాని లక్ష్మక్కయ్య కాడ శొంఠిపొడి పెట్టించుకుంటా. లోన కళావతి నిద్రలో ఉలిక్కిపడేను. సూత్తా ఉండని'' బైటికి నాలుగిళ్లవతల ఆచారిగారింటికి పోయింది వెంకటసుబ్బమ్మ.

కళావతి మంచం మీద ఆదమరచి నిద్రపోతోంది..

బయట ముసురుబట్టి వాతావరణం చలిగానే ఉది.

కూతురికి దుప్పటి కప్పాడు బలరామయ్య.

అడుగు దూరంలో ఉన్న తన మంచం మీద కూర్చుని కూతుర్ని చూస్తున్నాడు.

'కళావతి చక్కటి చుక్క. పైగా ఇంటర్ దాకా చదువుకున్న పిల్ల. అందుకే అదృష్టం కూడా తోడై ఫారిన్ పోబోతున్న వాడితో పెళ్లయింది ఆర్నెల్ల క్రితమే. రేపో మాపో పాస్‌పోర్ట్ వస్తుంది. అల్లుడు దగ్గరికి పంపాలి. ఈ పసిదాన్ని దేశంకాని దేశానికి పంపాలంటే బలరామయ్యకు దిగులవుతున్నది.

బలరామయ్య పెద్ద బావమరిది పట్నంలో కాలేజీలో లెక్చరర్. ఆ మధ్య బలరామయ్య పనుండి బావమరిది దగ్గరకు వెళ్లాడు.

"భలే అదృష్టవంతుడివి బావా ! ఒక మాంఛి సంబంధం వచ్చింది. నేనే నీ దగ్గరికి వచ్చి చెప్దామనుకుంటున్నాను. సమయానికి నువ్వే వచ్చేశావు. పిల్లవాడు కూడా ఊళ్లోనే ఉన్నాడు. ఆ దగ్గర చదువుకున్నాడే. నేను బాగా ఎరుగుదును. బుద్ధిమంతుడు. పై చదువులకు ఫారిన్ పోతున్నాడు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు పెళ్లి చేసుకుంటేగాని కదల్ని వీల్లేదంటున్నారని ఆ కుర్రాడే నాతో చెప్పాడు. ఏమంటావ్ బావా?'' అని అన్నాడు బామ్మర్ది బలరామయ్యతో.

"నీకు ఎరుకలో ఉంటే, నాకు సంశయం దేనిగ్గానీ బావా ! చూద్దాం లెమ్మని'' అన్నాడు బలరామయ్య.

కుర్రాణ్ణి చూడ్డం, నచ్చడం, మగపెళ్లి వారొచ్చి కళావతిని చూడ్డం · నచ్చడం జరిగాయి.

ఈ మాత్రం కట్నంలో ఇంతమంచి సంబంధం కుదరడం అదృష్టమన్నారంతా.

ముహూర్తం కూడా చాలా దగ్గర్లో పెట్టేశారు.

బలరామయ్య ప్రాణానికి ప్రాణంలాంటి పదెకరాల మాగాణిలో కూతురి పెళ్లి కోసం ఎనిమిదెకరాలు కోసిచ్చి అమ్మేశాడు. మిగిలిన రెండెకరాలే జీవనాధారం.

"ఎంత చేసినా ఏకైక సంతానం కూతురి సంతోషం కోసమే కాదా !'' అని వెంకటసుబ్బమ్మ నచ్చజెప్పింది బలరామయ్యకు.

అయితే ఆ పెళ్లి ముహూర్తం పెట్టుకున్న రాత్రికే అల్లుడు విదేశాలకు విమాన మెక్కాలని టికెట్టొచ్చింది.

మూడుముళ్లెయ్యగానే అల్లుడు హడావిడిగా విమానమెక్కాలని వెళ్లిపోడం బలరామయ్యకు చాలా బాధగా అనిపించింది.

అయితే అల్లుడు వెంటనే కళావతికి నాలుగు పేజీల ఉత్తరం రాశాడు.

అలా వెళ్లాల్సిన వచ్చినందుకు చాలా బాధపడుతున్నట్లు రాశాడు.

గత ఆర్నెల్లలో కళావతికి ఆరేడు ఉత్తరాలు రాశాడు.

రెండుసార్లు కళావతికి ఖర్చులకని అయిదేసి వేల విదేశీ డబ్బు పంపించాడు.

కళావతి అమాయకురాలైనా ఆమె భర్త మాత్రం చాలా తెలివైనవాడు.

ఆమె కన్నీ నేర్పి తన కనుకూలంగా మార్చుకోగలడు.

బలరామయ్యకి కళావతిని విదేశాలకు ఒంటరిగా పంపడానికి జంకుగా ఉందిగాని అల్లుడి సమర్థత మీద గట్టి నమ్మకమే ఉంది.

వెంకటసుబ్బమ్మ శొంఠి పొడి పెట్టించుకుని వచ్చేసింది.

"ఇదుగో ! 'బలరామయ్య మంచి పని చేశాడులేవే ! మంచి సంబంధం రాగానే ముందు ఖర్చు గురించి ఆలోచించకుండా పెళ్లి చేశాడు. ఇంక మీకు భారం తీరినట్లే. అందునా విదేశాల అల్లుడాయె. కూతుర్ని పువ్వుల్లోనే ఉంచుతాడు. దిగులేలేదు' అని అందయ్యా !'' అని కూతుర్ని చూసి "బంగారంలాంటి బిడ్డ. అదృష్టం వెతుక్కుంటూ వస్తుంది'' అని ఇరుగు దిష్టి పొరుగు దిష్టి తీరేంత దాకా మెటికలు విరిచింది.

---

## క్లింటన్‌గారు తడబడిన విధంబెట్టిదనిన..



నార్వే రాజు హెరాల్డ్, రాణి సొంజాలు క్లింటన్ ఆహ్వానం మీద వైట్‌హౌస్‌లో ఓ రాత్రి గడపటానికి వచ్చారు. తను ఆతిథ్యమిచ్చే శ్వేత గృహస్థు ఓ అయిదు నిముషాలు ముందుగా వెళ్లొచ్చు కదా ! ఖచ్చితంగా సమయానికి వెళ్లాడు. ఇంతలో రాజుగారు, రాణీగారు వాకిట్లో దిగారు. కొందరు క్లింటన్‌గారి కోసం పరిగెత్తారు. రాజ దంపతులను వాకిట్లో నిలబెట్టడాని కిచ్చగించని ఆఫీసర్లు ఇద్దరు వారికి స్వాగతం పలికి లోపలికి తీసుకొచ్చారు. ఆ తరువాత అయిదు నిముషాల కొచ్చారు క్లింటన్ దొర, హిల్లరీ దొరసాని. ఇద్దరూ కాస్త తడబడ్డారు. సిగ్గుపడ్డారు.

"క్లింటన్‌గారూ ! ఇకనైనా కాస్త పంక్చువాలిటీ నేర్చుకోండి'' అని గొణుక్కున్నారట అక్కడి వారు.

మంగళసూత్రాలు మెళ్లోంచి మంచం కిందికి వేళ్లాడుతున్నాయి. వాటిని మెళ్లోకి సర్ది, కూతురి పక్కన పడుకుంది.

రంగయ్య కూతురి మూలుగు వినబడుతూనే ఉంది.

"పాపం ! ఆ పిల్లకూ్కడా పెళ్లి చేసుంటే ఈపాటికి ఓ బిడ్డను చంకనేసుకుని సుఖంగా ఉండేది" అని అన్నాడు బలరామయ్య రంగయ్య కూతు ర్నుద్దేశించి.

"చేతిలో చిల్లి గవ్వైనా లేకనే కదయ్యా ఊర్కున్నాడు. కన్నబిడ్డకు ఏ తండ్రైనా అన్యాయం చేస్కుంటాడా ! ఇదుగో. పొద్దుపోయింది. ఆలోచనమాని, పడుకో" అని ఆవులిస్తూ వెంకటసుబ్బమ్మ. నిద్రలోకి జారుకుంది. ఆ అమ్మాయి మూలుగుతూనే ఉంది.

మధ్యరాత్రి వరకు మసలుతూనే ఉన్నాడు బలరామయ్య.

ఆ అమ్మాయి మూలుగు బలహీనంగా వినబడ్తోంది. ఆ శబ్దంతో కలుస్తూ ఎవరో చిన్నగా మాట్లాడుకుంటున్నట్లు వినబడ్తోంది.

"ఇదుగో నిన్నే." అని బలరామయ్య వెంకటసుబ్బమ్మను నిద్రలేపాడు.

"ఏందయ్యా !"

"ఎవరోమాట్లాడుతున్నట్టుంటే బయట."

"నాకేం వినరావట్లే నీ భ్రమగానీ పడుకో."

"వినబడుతుందే."

"మా కెవ్వరికీ వినరానిది నీ కెట్లా వినబడ్తుంది పడుకో !"

కాసేపు ఊర్కున్నాడు.

"బయట ఎవరో మాట్లాడుతున్నారు."

"అయితే చూసిరావయ్యా" అని అంది వెంకటసుబ్బమ్మ నిద్ర చెడగొడ్తూ మాట్లాడుతున్నందుకు చిరాగ్గా.

బలరామయ్య బైటికొచ్చాడు తలుపు గడియ తీసి.

వీధి లైటు వెలుతుర్లో అడ్డ పంచె పైకి చుట్టి ఎవరో మనిషి పరుగెత్తి దాటిపోతూ కనిపించాడు.

బలరామయ్యకు సావిట్లో ఏదో కదిలినట్లనిపించి పక్కకు తిరిగి చూశాడు.

గోడకు అతుక్కుపోయినట్లు మనిషి ఆకారం కనిపించింది.

"ఎవరూ?" అని గట్టిగా అన్నాడు.

"నేను... శివమ్మని.. చిన్నాయనా !" అని అంది ఆడగొంతు భయంభయంగా.

"సింగరయ్య కూతురివా !" అని అడిగాడు అనుమానంగా.

"ఆఁ..." అని అంటూ నెమ్మదిగా అక్కడ్నుంచి జారుకుంది.


బలరామయ్య ఎదుటి సావిట్లోకి చూశాడు.

రంగయ్య కూతురు తలవేలాడేసి నీరసంగా మూలుగుతోంది.

బలరామయ్య లోపల కొచ్చి మంచం మీద పడుకున్నాడు.

'సింగరయ్య మీద చాలా కోప మొచ్చింది. ఇప్పటికి రెండుసార్లు పంచాయతీలో కూతుగి గురించి తీర్మానించారు. సింగరయ్య భేషజంగా, తన గొప్పలకోసం. జల్సా కోసం రెండున్నర ఎకరం అమ్మడు. కూతురు శివమ్మ పక్క ఊళ్లో బడి చెప్తుంది. ఆడకూతురి సంపాదనతోనే గడిపెయ్యాలని చూస్తాడు. ఊళ్లో జనం కూతుగి గురించి నానారకాలుగా పంచాయతీలో మాట్లాడుతుంటే, "నా కూతురు ఊళ్లో అందరాడాళ్లలాగా చదువురాందికాదు. చదువుకుంది. ఉద్యోగం చేస్తున్నది. కనక కాని పని చెయ్యదని, సమర్థించుకున్నాడు తప్ప ఆ పిల్లకు పెళ్లి చేసే ప్రయత్నమే చెయ్యలేదు' అని అనుకుంటుంటే శివమ్మ మీద జాలి, కోపం కలిగాయి బలరామయ్యకు. కళావతి నిద్రలో ఒక పక్కకు ఒత్తిగిలి పడుకుంది.

'తన కూతురు మరికొన్నాళ్లలో ఇటువంటి కలుషిత వాతావరణానికి దూరంగా, హాయిగా ఉంటుంది' అని తలస్తూ తృప్తిగా నిద్రపోయాడు బలరామయ్య సన్నగా వినబడ్తున్న మూలుగుల మధ్య.




తెల్లారింది.

పక్షుల కిలకిలలు... ఎర్రదనం అలుముకున్న ఆకాశం... చల్లగాలి... రంగయ్య కూతురు స్తంభానికి వేలాడబడి మూలుగుతూనే ఉంది.

బలరామయ్య పొలం పోవడానికి సిద్ధపడుతున్నాడు.

పెద్ద బావమరిది వచ్చాడు.

"ఏం బావా ! సమాచారం లేకుండా తెల్లారగట్లా ఊడిపడ్డావ్ ! విశేషమేంది?" అని ఎదురు పొయ్యాడు బలరామయ్య.

"ఇదుగో ! మా యన్నను లోనకు రానీ. ఒక్కదుట్న నీ కన్నీ విషయాలు యాడ చెప్తడు" అని కాళ్లకు నీళ్లిచ్చి మర్యాదలు చేసింది అన్నకు వెంకటసుబ్బమ్మ.

"చెప్పన్నా ! ఒదినె పిల్లోళ్లు బాగున్నారా !" అని అడిగింది వెంకట సుబ్బమ్మ.

"బాగున్నారమ్మా !" అని చేతి సంచీలోంచి చెక్కుదీసి "యాభైవేల రూపాయల చెక్కమ్మా !" అని వెంకటసుబ్బమ్మ చేతి కిచ్చాడు.

"మా యల్లుడు పంపాడన్నా ! పారన్నుంచి" అని చెక్కందుకుంటూ అంది మురిపెంగా.

"కళావతీ ! అని కూతుర్ని పిలిచి "నే పెనిమిటి పంపించాడంట" అని కళావతి చేతి కిచ్చింది.

కళావతి సిగ్గుపడుతూ చెక్కు తీసుకుని లోపలికి పరుగెత్తింది.

వెంకటసుబ్బమ్మ అన్నగారు ఊళ్లో అడుగుపెట్టింది మొదలు బలరామయ్య ఇంటి సావిట్లో జనం చేర్తున్నారు.

యాభైవేల రూపాయల చెక్కు కళావతి మొగుడు ఫారన్నుంచి పంపించాడన్న సమాచారం ఊరంతా మొయ్యడానికి జనం వెళ్లిపోతున్నారు. కొత్త జనం చేరుతున్నారు.

జనాల పొగడ్తలకు వెంకటసుబ్బమ్మ మొహం గర్వంతో మెరిసిపోతోంది.

"ఏం బావా ! మెత్తగా ఉన్నావ్. సుస్తీగానీ చేసిందా? లోనకురా !" అని బలరామయ్య మంచం వేశాడు లోపల.

"కాస్సేపు కళ్లు మూసుకో బావా ! ఉషారవుద్దిలే" అని అన్నాడు బావమరిదితో.

"ఇదుగో నిన్నే. మీ యన్నకు శెట్టి గా రంగడి కాడ ఇడ్లైనా తెప్పిస్తావా, లేదా?" అని అరిచాడు వెంకటసుబ్బమ్మ నుద్దేశించి.

"నా కిప్పుడేమీ వద్దుగానీ బావా !" అని ఆగి, "అల్లుడు విడాకుల నోటీసు పంపించాడు. ఇవ్వాళ వకీలు నీకు తెచ్చిచ్చేవాడే. నువ్వు విని తట్టుకోలేవని నేనే వచ్చాను" అని బావమరిది చెప్తుంటే నమ్మశక్యం కావడంలేదు బలరామయ్యకు.

"నా... పార్నల్లుడా..." అని పిడుపాటు వార్తకు ఖంగుతిని అన్నాడు. ఎలా చెప్పాలోనని మాట లెతుక్కుంటున్నాడు బామ్మర్ది.

"బావా ! వాడు యాభైవేలు ఇప్పుడు పంపించాడు. మిగిలింది త్వరలో పంపిస్తాడంట. వా డక్కడ ఇంకో పిల్లతో మనసు కలిసి మనువాడాడంట. వాడి నాయన దగ్గరికిపోయి విషయం చెప్పి, నిలేసినా, అంతా పిల్లాడి ఇష్టమేనని ఖరాఖండిగా చెప్పేశారు బావా !" అని చాల కష్టమ్మీద మనస్సులో బాధను దిగమింగి చెప్తున్నాడు.

బలరామయ్య మంచం మీద కూలబడ్డాడు.

అమాంతంగా అగాధంలోకి జారిపోతున్నవాడిలా నిస్సహాయ పరిస్థితిలో ఉన్నా డిప్పుడు బలరామయ్య.

బలరామయ్యకు బుర్ర పనిచెయ్యడంలేదు.

"బావా ! దిగులుపడకు. విదేశాల్లో ఇచ్చిన విడాకులు ఇక్కడ చెల్లవని ప్లీడరు అంటున్నాడు. మనం వా డంతు చూసిగాని వదలం" అని చెప్పుకుపోతున్నాడు బావమరిది బలరామయ్యకు సాంత్వనగా.

బలరామయ్యకు ఏమీ వినిపించని నిశ్శబ్దం ఆవరించిం దతని మనసు నిండా. ◆